సాక్షి సిద్దిపేట

గురువారం । 12 । అక్టోబర్ । 2023



గృహ'లక్ష్మి' వరించేనా..!

గృహలక్ష్మి పథకంపై పేదలు చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఆశలు కల్లలవుతున్నాయి.

వివరాలు 10లో ▸



ఆశపడితే అంతేసంగతులు

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారు.

వివరాలు 10లో ▸



వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీసు యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీపోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సీపీ సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న కమిషనర్ శ్వేత

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఒకే రోజు ముగ్గురు బాధితులు ఆన్‌లైన్‌లో రూ.1,24,906 పోగొట్టుకుని సైబర్ మోసానికి గురయ్యారన్నారు. చేర్యాల పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తి క్రెడిట్ కార్డు పేరిట వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి రూ.53,154 పోగొట్టుకున్నాడు. అలాగే అక్కన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మరొక వ్యక్తి లోన్‌పేరిట రూ.42,352 మోసపోయాడని, గజ్వేల్ పీఎస్ పరిధిలోని ఒక వ్యక్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ గురించి గూగుల్‌లో వెతికి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి రూ.29,400 పోగొట్టుకున్నాడనిచెప్పారు. బాధితులు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారని దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లబ్ధి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బీఎన్ రావు

మద్దూరు(హుస్నాబాద్): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లబ్ధి చేకూరుతుందని జాతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ రావు అన్నారు. బుధవారం మద్దూరు మండలం వల్లంపట్లలో సాగవుతున్న పామాయిల్ తోటలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. దేశంలో పామాయిల్ వినియోగంతో డిమాండ్ పెరిగిందన్నారు. ఒక్కసారి తోటలను సాగులోకి తీసుకువస్తే 30 సంవత్సరాల వరకు రైతులకు దిగుబడులను అందిస్తుందన్నారు. సాగులో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకురావాలన్నారు. పామాయిల్ తోటల సాగుకు ముందుకు వచ్చే రైతులు స్థానిక ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, ఉద్యానశాఖ అధికారి పండరి, పామాయిల్ జిల్లా కో–ఆర్డినేటర్ శంకర్, ఏఈఓ రాజేష్, రాధిక, అఖిల్, కల్పన, అనూష తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో జాతీయ సమైక్యతా శిబిరం

ఎన్‌సీసీ క్యాడెట్లకు 12 రోజులపాటు ప్రత్యేక శిక్షణ



ప్రత్యేక శిబిరానికి హాజరైన క్యాడెట్లు

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీలో ప్రతిష్ఠాత్మకమైన ప్రత్యేక జాతీయ శిబిరానికి గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ వేదికైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నిజామాబాద్ బెటాలియన్ కల్నల్, క్యాంపు కమాండెంట్ సునీల్ అబ్రహం, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కల్నల్ పీఎస్ నందాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని 11 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచే సుమారు 300 కాడెట్ల కోసం ఈనెల 12 నుంచి 23వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈనెల 14 నుంచి 23వరకు సంగారెడ్డి బెటాలియన్‌కు చెందిన మరో 600 మంది కాడెట్లతో సంయుక్త వార్షిక శిక్షణ శిబిరాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వహణాధికారి లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ భవాని, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ కాడెట్లు పాల్గొన్నారు.





ప్రచార రథాలు రెడీ..

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని పార్టీలు ప్రచారానికి తెరలేపాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల ప్రచార రథాలు సిద్ధమవుతున్నాయి.. సిద్దిపేట నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ప్రచార రథాలు రెడీ అయ్యాయి.

– సాక్షి స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, సిద్దిపేట

సారు బండి.. సర్కారు కరెంటండి!

సారు బండికి సర్కారు కరెంటు ఏమిటని ఆలోచిస్తున్నారా? అవును మీరు చదివింది నిజమే.. ఓ గ్రామ కార్యదర్శి పంచాయతీ కార్యాలయ విద్యుత్‌ను తన సొంత ఎలక్ట్రిక్ వాహనానికి వినియోగించుకుంటున్నారు. ఇతనే కాదు సర్పంచ్ సైతం ఇలానే వ్యవహరిస్తున్నారు. ఇలా నెలల తరబడి కొనసాగుతోంది. నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామానికి చెందిన కార్యదర్శి బొందుగుల రమేశ్, సర్పంచ్ నారాయణ జీపీ విద్యుత్‌ను తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. కొందరు స్థానికులు గమనించి ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వారు వాపోయారు. చేసేదిలేక వీరి నిర్వాకంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలని కోరారు.

– సిద్దిపేటరూరల్



పంచాయతీ కార్యాలయం వద్ద వాహనానికి చార్జింగ్.

ఇంకా తేలని ప్రత్యర్థులు

అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ

- అయోమయంలో పార్టీల శ్రేణులు
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్
- ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల సంఘం
- త్వరలో ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణ



సాక్షి, సిద్దిపేట: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో జిల్లాలో రాజకీయ సందడి నెలకొంది. వచ్చే నెల మూడు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రజల మధ్య ఉంటూ కార్యక్రమాలను నిర్వహిస్తూ దూసుకుపోతున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ఎవరికి టికెట్ ఇస్తారోనని ఆయా పార్టీల కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. నామినేషన్ల స్వీకరణ తేదీ ప్రకటించినా అభ్యర్థులను ప్రకటించలేదు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న ఆశావహులు తమ మద్దతుదారులను కూడగట్టుకుని కేంద్ర, రాష్ట్ర నాయకత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొందరైతే ఢిల్లీ, హైదరాబాద్‌లలో మకాం వేసి అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు.

'హస్త'వాసి ఎవరికో?

కాంగ్రెస్ పార్టీనుంచి పోటీలో నిలిచే ఆశావహుల నుంచి ఆగస్టు 18 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులను గాంధీభవన్‌లో స్వీకరించారు. సిద్దిపేటకు 15, హుస్నాబాద్‌కు ఆరుగురు, గజ్వేల్‌కు 8, దుబ్బాకకు ఐదుగురు దరఖాస్తు చేశారు. సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు స్క్రీనింగ్ కమిటీ పలుమార్లు దరఖాస్తులను పరిశీలించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో టికెట్ ఆశిస్తున్న ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. టికెట్ వస్తుందా రాదా అని టెన్షన్ పడుతున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు పేర్లతో కూడిన షార్ట్ లిస్టును ఢిల్లీకి పంపినట్లు సమాచారం. అందులో దుబ్బాక నుంచి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డి, కత్తికార్తీక, హుస్నాబాద్ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సిద్దిపేట నుంచి భవాని, చంద్రం, హరికృష్ణ, జనగామ నుంచి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిల పేర్లు ఉన్నట్లు తెలిసింది. గజ్వేల్ నుంచి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది.

బీజేపీ నుంచి నిలిచేదెవరో?

బీజేపీ నుంచి ఎవరు బరిలో ఉంటారో ఇంకా ఆ పార్టీ ప్రకటించలేదు. దుబ్బాక నుంచి ఎమ్మెల్యే రఘునందన్ రావు పోటీ చేయనున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి, ఇతరులు, గజ్వేల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుంది. హుస్నాబాద్ నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హౌస్‌ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఇద్దరు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. వామపక్షాలు ఎవరితో పొత్తు లేకపోతే వారు సైతం అభ్యర్థులను ప్రకటించనున్నారు.

ప్రకటిస్తేనే ప్రజల్లో వెళ్లే అవకాశం

కాంగ్రెస్, బీజేపీ తరుపున అభ్యర్థులను ప్రకటిస్తేనే ప్రజలల్లోకి వెళ్లవచ్చని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారు టికెట్ కోసమే ప్రధానంగా దృష్టిపెట్టారు. పోటీచేసే అవకాశం ఇవ్వాలని జాతీయ, రాష్ట్ర నేతలను కోరుతున్నారు. ఎంత ఆలస్యంగా ప్రకటిస్తే అంత ప్రజలల్లోకి వెళ్లడం కష్టంగా మారుతుందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- వెయ్యి పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సందర్శన



వేయి పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటకమాన్: రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ జీవన్ పాటిల్ వైద్యులకు, సిబ్బందికి సూచించారు. మానవతా దృక్పథం అవసరమన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి శివారులోని వెయ్యి పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్‌లతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, విద్యార్థుల డెమో గది, డెంటల్, ఈఎన్‌టీ, కంటి విభాగ, హెల్ప్ డెస్క్, ఫార్మసీ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు సులభంగా తెలిసే విధంగా హెల్ప్ డెస్క్ పని చేయాలన్నారు. ఆస్పత్రికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈకి తెలిపారు. కావాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్మాణ ఏజెన్సీకి సూచించారు. అలాగే పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈ విశ్వప్రసాద్, ఈఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్, మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రి



సభా స్థలంలో సూచనలు చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రగతి–ప్రజా ఆశీర్వాద సభా స్థలాన్ని బుధవారం మంత్రి హరీశ్ రావు పరిశీలించారు. స్థానిక వేములవాడ కమాన్ పరిసరాల్లో, నాగదేవత దేవాలయం నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డు మార్గంలో రెండు చోట్ల స్థలాలను పరిశీలించారు. వీటిలో నాగదేవత దేవాలయం రోడ్డు పక్కన స్థలాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. ఆయన వెంట ఏసీపీ సురేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

సిద్దిపేటజోన్: 'నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులయ్యాం.. ఎన్నికల్లో హరీశ్‌రావుకు అండగా ఉంటాం.. లక్షన్నర మెజార్టీ సాధనలో భాగస్వామ్యం అవుతాం' అని బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్ రావు సమక్షంలో సిద్దిపేట అర్బన్ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ నరేశ్‌గౌడ్, చిన్నకోడూర్ మండలం విఠాలాపూర్ గ్రామ ఉప సర్పంచ్(బీజేపీ)మధుసూదన్ రెడ్డి, నాంచారుపల్లి గ్రామ యూత్ విభాగం అధ్యక్షుడు నాగరాజు లు తమ అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి హరీశ్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'పల్లా'కు డివిజన్ సెగ



పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): జనగామా నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్‌లో నెలకొన్న అసమ్మతిని బుజ్జగించి ప్రచారంలో దూసుకుపోవాలనుకున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం ఆదిలోనే అడ్డంకిగా మారింది. ఈ నెల 16న జనగామ జిల్లా కేంద్రంలో జరగనున్న సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లు, జనసమీకరణ వంటి అంశాలపై చర్చించేందుకు బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరయ్యేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్తుండగా పాత బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో డివిజన్ సాధనకై దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు పల్లాను అడ్డుకునేందుకు యత్నించారు. పల్లా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. గమనించిన పల్లా దీక్ష శిబిరం వద్దకు వచ్చి జేఏసీ నాయకులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా నాయకులు నినాదాలతో హోరెత్తించారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చేసేదిలేక పల్లా వెనుదిరిగివెళ్లిపోయారు. పోలీసుల జోక్యంతో ప్రశాంత వాతావరణం నెలకొంది.

కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం



కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పల్లా

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆశీస్సులతో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనకు బీఆర్‌ఎస్ టికెట్ రావడంతో మల్లన్న ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆనందంగా, సుభిక్షంగా ఉన్నారంటే దానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రమ ఫలితమేనని అన్నారు. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి దూళ్మిట్ట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మేనిఫెస్టో ప్రచార కమిటీ సభ్యుడిగా 'కప్పర'



ప్రసాదరావు

గజ్వేల్: బీజేపీ రాష్ట్ర మేనిఫెస్టో–ప్రచార కమిటీ సభ్యుడిగా గజ్వేల్ నియోజకవర్గంలోని తిగుల్ గ్రామానికి చెందిన కప్పర ప్రసాదరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం అధిష్టానం ఆయన నియామకాన్ని ఖరారు చేసింది. ఈ సందర్భంగా కప్పర మాట్లాడుతూ 30 యేళ్లుగా జర్నలిస్టుగా పనిచేసిన తన అనుభవంతో ప్రజల ఆకాంక్షలను మేనిఫెస్టోలో చేర్చేలా కృషి చేస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు.

బాలికల ఉన్నతి అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం
- సిద్దిపేటలో అవగాహన ర్యాలీ



సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

సిద్దిపేటకమాన్: బాలికల ఉన్నతికి దోహదం చేయాలని, సామాజిక పరంగా వారికి ధైర్యం అందించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం అన్నారు. ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయ విజ్ఞాన సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి బాలికలు రేపటి మహిళలు అన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. బాలికల పరిరక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు మిలింద్ కాంబ్లి, శ్రావణి యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వై.రాజేశ్వర్‌రెడ్డి, మంతూరి సత్యనారాయణ, పత్రి ప్రకాష్, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలుచేస్తే శిక్షార్హులు



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి అనిత, అధికారులు

నర్సాపూర్: బాల్య వివాహాలుచేస్తే శిక్ష తప్పదని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హెచ్చరించారు. బుధవారం స్థానిక సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల బాలికల వసతి గృహాలలోని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం విద్యార్థినులతో పాటు ఆమె ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శివకుమార్, న్యాయవాదులు, పలు వసతిగృహాల సంక్షేమ అధికారులు గాయత్రి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

జూనియర్ సివిల్ జడ్జి శివరంజని



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ గర్ల్, చైల్డ్ డే సందర్భంగా ఆడపిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ఆడ పిల్లలు జీవించడానికి కొన్ని హక్కులను కల్పించిందన్నారు. సెల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ అధికారి మమత, న్యాయవాదులు బాకం సంపత్, ప్రవీణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు విద్యార్థినులు



రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర స్థాయి అండర్ 19 ఖోఖో జట్టుకు తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రంగబోయిన మానస, ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సీత మమత ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని వారు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కళాశాల విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: మండలంలోని బూర్దిపాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నర్సింహులు గుండెపోటుతో మరణించాడు. బంధువులు సమాచారం ప్రకారం.. నర్సింహులు ఝరాసంగం మండలంలోని కక్కరవాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం తెల్లవారున గుండె పోటు కు గురై మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తమ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, సామాజిక ఉద్యమ కారుడు ఢిల్లీ వసంత్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు, కాంగ్రెస్, బీజేపీ, బీ ఆర్ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

గృహ'లక్ష్మి' వరించేనా..!

- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు

హుస్నాబాద్‌రూరల్: పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశ పెట్టి నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరు చేసింది. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సంఖ్య ఎక్కువే. వారిలో చాలామందికి సొంత ఇళ్లు లేవు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లు తమకు వస్తాయని ఎదురు చూసినా.. వారందరికీ నిరాశే ఎదురైంది. ఇంటి నిర్మాణ వ్యయం పెరగడంతో ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం, నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేయడంతో పేదలు తమకు సొంత ఇళ్లు వస్తాయని ఆశించారు. 162 గ్రామాలు ఉన్న నియోజకవర్గానికి 3 వేలు ఇళ్లను గ్రామాల వారీగా కేటాయిస్తే ఊరికి 15 నుంచి 20 మందికే లబ్ధి చేకూరింది. ఇంకా చాలా మంది పేదలు సొంత ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

నిబంధనల పేరుతో దరఖాస్తుల తిరస్కరణ

సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలో చాలా తక్కువ దరఖాస్తులు రావడం అధికారుల కొర్రీలకు నిదర్శనం. బీసీ బంధు పథకం లబ్ధిదారులకు గృహలక్ష్మి దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దీంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇళ్లను స్లాబ్‌లు వేసి వదిలేశారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తే తమ ఇళ్లనిర్మాణం పూర్తిచేసుకుంటామని వారంతా వేడుకుంటున్నారు.



గాంధీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న ఇల్లు

మండలానికి 281 ఇళ్లు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం కోసం మండలంలో 781 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం. అందులో 281 మందిని ఎంపికచేసి ప్రక్రియ మొదలు పెట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాతనే ఎంపిక చేస్తాం. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే మరికొన్ని దరఖాస్తులను తీసుకుని ఆన్‌లైన్ చేస్తాం.

– ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, హుస్నాబాద్

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విభీషణ్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ సమయంలో బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన ఘర్షణకు దారి తీసిందన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దేశ ప్రధానిని అవమానించేలా చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేయగా ఇంత వరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఈ అక్రమ కేసులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి వేణుగోపాల్, నరేష్, యాదవ్‌రావు, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిగల్లపేట సిద్దిపేట

పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ



మాట్లాడుతున్న శంకర భారతీ స్వామీజీ

కొండపాక(గజ్వేల్): సిద్ధిగల్లపేట సిద్దిపేట అని పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ పేర్కొన్నారు. కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మిస్తున్న అష్టాదశ శక్తి పీఠ సహిత రామలింగేశ్వర దేవాలయ నిర్మాణాన్ని ఆయన బుధవారం సందర్శించారు. నిర్మాణానికి సంబంధించి కొన్ని సలహాలు, సూచనలు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 18 శక్తి పీఠాల్లో కొండపాకలో నిర్మించే పీఠం ఒకటన్నారు. సిద్దిపేట ప్రాంతం ఎంతో పుణ్యస్థలంగా వెలుగొందుతుందన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ చైర్మన్ లత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురిరెడ్డి, ఆనంద నిలయం ట్రస్టు సభ్యులు వైకుంఠం, గట్టు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా టిప్పర్ యూ టర్న్

- ఢీ కొన్న స్కూల్ బస్సు
- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న స్కూల్ బస్సు

మనోహరాబాద్(తూప్రాన్): అకస్మాత్తుగా టిప్పర్ డ్రైవర్ యూటర్న్ తీసుకోవడంతో స్కూల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మేడ్చల్‌లోని విజ్ఞాన్ పాఠశాల బస్సులో కూచారం, కాళ్లకల్ గ్రామాల విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో కాళ్లకల్ శివారులో జాతీయ రహదారి 44పై క్రెస్ట్ కేబుల్ పరిశ్రమ సమీపయూర్న్ వద్ద టిప్పర్ వేగంగా రోడ్డుపైకి రావడంతో స్కూల్ బస్సు ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులు, టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే బస్సు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు చికిత్స చేయించి పాఠశాలకు పంపించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డా.రాంకిషన్



టాపర్ విద్యార్థినులతో రాంకిషన్ తదితరులు

కొండపాక(గజ్వేల్): ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. మండంలోని వెలికట్ట శివారులోని శ్రీకృప ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సైన్సు ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఫార్మసీ రంగంలో దూసుకుపోతున్న భారతదేశం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. కొండపాకలో బీ ఫార్మసీ కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టమన్నారు. జాతీయ డ్రగ్స్ మ్యానుఫేక్చర్స్ అసోసియేషన్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ కళాశాలలో 19సార్లు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. కళాశాల నుంచి 16 బ్యాచ్‌ల విద్యార్థులు ఫార్మసీరంగంలో ఉన్నత స్థానాల్లో ఉండటం సంతోషదాయకమన్నారు. అనంతరం టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థినులను శాలువాతో సన్మానించి, వెండి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల పంటలతో అధిక దిగుబడులు

సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ శాస్త్రవేత్తలు



కూరగాయల పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మర్కూక్(గజ్వేల్): పండ్లు, కూరగాయల తోటల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ జీడిమెట్ల, హైదరాబాద్ శాస్త్రవేత్తలు సూచించారు. పాతూరు గ్రామంలో కూరగాయల పంటలపై ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ నిర్వహించారు. వంగ పంటలో పండ్లు, రెమ్మల తొలుచు పురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డా.స్వేత, ప్లాంట్ పాథాలజీ అధికారి సుధ, హార్టికల్చర్ అధికారి సౌమ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రజినికాంత్, రైతులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

రూ.20లక్షల వరకు నష్టం



దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి

సంగారెడ్డి టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమయిన ఘటన పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. చౌరస్తాలోని కిరాణా దుకాణం నిర్వాకుడు హనుమంతు రోజు మాదిరిగా బుధవారం మధ్యాహ్న సమయంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. వెళ్లిన కొంతసమయానికి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ రావడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న సామగ్రి కాలిబూడిదయింది. సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం సంభవించినట్టు యజమాని వాపోయాడు. ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఆశపడితే అంతేసంగతులు

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- రెండు నెలల్లో 515 కేసులు
- ఆన్‌లైన్ జాబ్, ఫోన్ కాల్స్‌తో బురిడీ
- మోసపోయిన వారిలో చదువుకున్నవారే అధికం

సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే జిల్లాలో 515 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయి. వాటిలో అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎక్కువ జరుగుతున్నాయి. మోసపోతున్నవారిలో చదువుకున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని కొత్త తరహాల్లో సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ప్రతి రోజు అధిక సంఖ్యలో సైబర్ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినా నేరగాళ్లను పట్టుకున్న ఘటనలు చాలా తక్కువే. ఆన్‌లైన్ మోసాల వల్ల ప్రజలు అధిక మొత్తంలో నష్టపోతున్నారు.

మోసపోతున్నది ఇలా..

ఆన్‌లైన్ ఉద్యోగాలు, పార్ట్‌టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌లకు స్పందించడం; ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియా యాప్స్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటన లింక్‌లను క్లిక్‌చేయడం; పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ నగదు ఇన్వెస్ట్ చేయించడం; అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించడం; డెబిట్, క్రెడిట్ కార్డులు అప్డేట్ చేయాలనడం; ఫోన్ ద్వారా డబ్బులు చెల్లిస్తామనే పేరుతో సైబర్ వలకు చిక్కుతున్నారు.


ఇటీవలే జరిగిన ఘటనలు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17న పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. తర్వాత పలు దఫాలుగా రూ.30 లక్షలు చెల్లించాడు. అయితే సైబర్ నేరగాళ్లు ఆయన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. ఒక సమయంలో తన నగదుతో పాటు కమీషన్‌ను ఇవ్వాలని అడగడంతో అసలు విషయం బయట పడింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్‌తో పాటు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో రామచంద్రపురం మండల పరిధిలోని ఈదునాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.26 లక్షలు, అమీన్‌పూర్ మండల పరిధిలోని లాలాబాయ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.28 లక్షలు చెల్లించారు. చివరిగా వారు తమ నగదు, కమీషన్ ఇవ్వాలని అడగ్గా స్పందనలేకపోవడంతో వారు సైబర్ పోలీసులకు సమాచారం ఇచ్చి, అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసుల సూచనలు

అపరిచితుల వాట్సప్, ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా ఉండాలి. ఆన్‌లైన్లో తక్కువ ధరకే వస్తువులు, సేవలు అందిస్తామనే ప్రకటనలు చూసి మోసపోవద్దు. అన్నీ పరిశీలించిన తర్వాతే నగదు చెల్లించాలి. సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు ప్రైవసీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరితోనూ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేసుకోకపోవడమే మంచిది. ఉచిత వైఫై, ఓపెన్ నెట్‌వర్క్‌ల ద్వారా లాగిన్‌ఐతే సైబర్ నేరగాళ్లు పాస్‌వర్డ్ దొంగతనంచేసే అవకాశం ఎక్కువ.

1930కి సమాచారం అందించాలి



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో చిక్కుకుని మోసపోతున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్ బీడీఎల్, జిన్నారం బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఫోన్‌కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్‌ల పేరుతో వచ్చే ఆన్‌లైన్ జాబులను నమ్మొద్దు.

– డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, పటాన్‌చెరు

విద్యార్థి మృతిపై విచారణ



కపూర్‌నాయక్‌తండాలో విచారిస్తున్న వైద్యబృందం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థి మృతిపై వైద్య బృందం విచారణ చేపట్టింది. ఈ ఘటన కపూర్‌నాయక్‌తండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీర భాస్కర్‌నాయక్, స్వరూప దంపతుల పెద్దకుమారుడు అజ్మీర చరణ్(14) మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు హుస్నాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులుగా జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. బాలుడి మృతిపై తల్లిదండ్రులను అడిగి పలువివరాలను, వైద్యపరీక్షలు చేయించిన రిపోర్టులను పరిశీలించారు. బాలుడు డెంగీతో మృతి చెందలేదని, వంశపార్యం పరంగా వచ్చే వ్యాధి కారణంగా మృతి చెందినట్లు డాక్టర్ వినోద్ రెడ్డి వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ కోరారు.

ప్రభుత్వ భూమిలో ఆయిల్‌పామ్

- దర్జాగా ఆక్రమించి సాగు
- చర్యలకు స్థానికుల డిమాండ్



ప్రభుత్వ భూమిలో సాగుచేసిన ఆయిల్‌పామ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాడు ఒక ఘనుడు. మండల పరిధిలోని కుందనవానిపల్లి గ్రామ శివారులో వైకుంఠధామ, డంపుయార్డు, క్రీడాప్రాంగణం మైదానానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఒకరైతు కొంత భాగాన్ని ఆక్రమించి దర్జాగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. సర్వే నంబర్ 96లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుకు గత ప్రభుత్వం మూడెకరాల భూమినిచ్చింది. దానితో పాటు ఆ రైతు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొంత భాగం ఆక్రమించుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేశామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసిన రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఆర్ఐని పంపించి విచారణ చేపడతానని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యం



అనురాధ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన మాచవరం సుధాకర్‌కు 2013లో తూప్రాన్ మండలం యావపూర్ గ్రామానికి చెందిన కాగిత అనురాధతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అనురాధ సోమవారం ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త ప్రశ్నించడంతో గొడవపడింది. చిట్టి డబ్బులు కట్టడానికని ఆమె మంగళవారం ఇంట్లోంచి వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో సుధాకర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బీరువాలో ఉన్న రూ.50 వేలు కనిపించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఫైనాన్స్ సిబ్బంది బైక్ తీసుకెళ్లారని..



ప్రవీణ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ ఫైనాన్స్ కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్లారని మనస్తాపంతో యువకుడు అదృశ్యమైన ఘటన పోతులబోగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంద ప్రవీణ్ గతంలో మేడ్చల్‌లోని ఓ ప్రవేట్ ఫైనాన్స్‌లో బైక్‌ను కొనుగోలు చేశాడు. కాని మూడు నెలలుగా వాయిదాలు చెల్లించక పోవడంతో ఈ నెల 3న ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్ళిపోయారు. వేలం వేయనున్నట్లు మంగళవారం నోటీస్ పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ షోరూంకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో తండ్రి మంద మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

జీవితంపై విరక్తితో టీచర్...



రమేశ్ (ఫైల్)

దుబ్బాక: జీవితంపై విరక్తి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన యెమాజీగారి రమేశ్(48) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవాడు. రెండేళ్ల క్రితం ఆయన పక్షవాతం బారిన పడ్డాడు. అప్పటి నుంచి విధులు సక్రమంగా నిర్వహించలేకపోవడం, ఆర్థిక సమస్యల్లో కూరుకుపోవడం.. పెళ్లి కాకపోవడంతో మనోవేదన చెందుతూ ఉండేవాడు. ఈ క్రమంలో రమేశ్ జీవితంపై విరక్తితో మంగళవారం అర్ధరాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నించాడు. బుధవారం ఉదయం వాంతులు చేసుకుంటున్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మద్యం మత్తులో ఉరివేసుకొని..

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన జగదీశ్ దేశ్‌ముఖ్(38) భార్య శ్రీదేవితో కలిసి ఇస్నాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారి కూతురు శాలిని(3) ఇటీవల అనారోగ్యానికి గురవడంతో జగదీశ్ భార్య శ్రీదేవి తమ పాపను తీసుకుని బీదర్ వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జగదీశ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్‌చేసి తాను చనిపోతానని చెప్పాడు. దీంతో శ్రీదేవి తనకు పరిచయస్తుడైన బాలాజీకి ఫోన్‌చేసి వెళ్లి చూడమని కోరింది. ఆయన ఇంటికి వెళ్లి చూసేలోపు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటం గమనించి సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.